# మధురవాణి

పడమటన ఆకాశం మెల్లమెల్లగా ఎరుపు రావడం బరువెక్కుతోంది. ఎరుపు వచ్చి సంధ్యారాగం చిక్కపడుతోంది.

ఎరుపు కలయిక వల్లనేమో మమతలరావు పొందుతున్న అనుభూతికి ఓ చిన్న కలత ఏర్పడింది. ప్రశాంతతకి బహిర్ ప్రపంచం అంతరాయం కాదని అతని విశ్వాసం. ప్రశాంతతని కోరుకోవడం అతని నిత్యప్రయత్నం. అది వచ్చినట్టే వచ్చి చటుక్కున మాయమైపోతూ ఉంటుంది. అదే జీవిత సత్యమా ? నీలిమలో ఎరుపెందుకో అనిపించిందేమో – 'ప్రశాంతంగా ఉండాలని ఉంటుంది – కాని మనుషులకు అది సులభసాధ్యం కాదేమో !' అంటూ ఉస్సురని మమతలరావు నిట్టూర్చాడు.

అతని మిత్రుడు పార్వతీశం ఓమారు అతని వంక తిరిగి అతని ముఖంలోకి చూశాడు. ఆ కళ్లు తన వంక కాకుండా నీలి సముద్రం వంక చూస్తున్నాయి. స్నేహితుడి భుజం మీద చెయ్యి వెయ్యగానే మమతలరావూ అతని చేతి మీద చెయ్యి వేశాడు.

ఇద్దరూ మరికాసేపు ఇసుకలో నడిచారు. 'ఇక కూచుందాం' అన్నాడు మమతల రావు. ఇద్దరూ మౌనంగా కూచున్నారు కాసేపు. వారిద్దరిమధ్య అత్యంతమైన ఆత్మీయతను పెంచి రెండు మనసుల మధ్య పటిష్ఠమైన వంతెన కట్టినది ఈ నిశ్శబ్ద సంభాషణమే. కనీసం ఒకరివంక ఇంకొకరు చూడకుండా గంటల తరబడి పక్కపక్కనే కూర్చుని నోరు విప్పనక్కరలేకుండానే వారు ఆలోచనా ప్రసారాలు చేసుకోగలగడం వారి ఆత్మీయతా లక్షణం.

'' ఇక మనం బయలుదేరడం మంచిదేమో !'' అంటూ పార్వతీశం లేచాడు.

'' ఇంకాసేపు కూచుంటే ఏం పోతుందేమిటి ?'' బద్ధకంగా, నిష్టూరంగా అన్నాడు మమతలరావు.

''అరవకుండా కరకరా ఆకలి మొదలవుతుంది. – మొదలే అలా అవడం నా ఆకలి లక్షణం అంటాడు మన వైద్య మిత్రుడు. ఆ రెండు రొట్టెలూ తినేసేదాకా తోచనివ్వదది...''

ఆ మాట విన్నాక మమతలరావు ఠక్కున లేచి మిత్రుడిని అనుసరించాల్సి వచ్చింది.

సముద్రం మీద కెంపుల తళతళల్ని చూస్తూ పరధ్యానంగా నడుస్తున్న పార్వతీశం '' ఏమిరా ఆ పద్యం ?'' అంటూ అడిగాడు.

మమతల కవి – ఆ బాల్యమిత్రుడూ, సహపాఠీ – విజయనగర సంస్థాన – దరిమిలా సింహాచల దేవస్థాన సత్రంలో సహభోక్తా, పార్వతీశం వంక తల తిప్పాడు.

'' ఏం చమక్‌రా అది....'' సినిమా కవి మమతలరావుగా తెలుగు నాట మారుమ్రోగిపోతున్న మిత్రుని మెడలోని పులిగోరు గొలుసు తళుక్కుమనేటట్లు తనవంక తిరగడం పత్రికారచయిత పార్వతీశం దృష్టిని ఆకట్టుకుంది.

''కొమ్మా.... చేవా... అదీ !''

'' ఓహ్ అదా !...... అచట పుట్టిన చిగురుకొమ్మయిన చేవ....''

'' ఓ కొమ్మ గురించి నీతో ఓ మాట చెబుదామని ఇంత దూరం తీసుకువచ్చా. ఏవో ఎక్స్‌ట్రా వేషాలు వేస్తోంది. ఏదయినా ఓ కాస్త మంచి వేషం ఇప్పించమని – మరెవడూ దొరకనట్లు – నన్ను అడిగింది. చెప్పి చేయించగలిగిన వాడినే అయితే ఎందుకు ఇలా ఉంటానని ఆలోచించలేనిదేమో

– నేనేమీ అనకముందే నా వంక జాలిగా చూసింది. – ఏదయినా భరించగలను కాని ఆమె కళ్లల్లో చిప్పిల్లుతున్న నీటి వెలుగును తట్టుకోలేక......'' పార్వతీశం చెప్పేశాడు. మనసు తేలికపడినట్లనిపించింది.

మిత్రుని మౌనం పార్వతీశానికి కొంత కలత కలిగించింది. ఏదయినా మాటాడాలనిపించి అన్నాడు. ''కాళ్లు లాగుతున్నాయి. కారులో వెళ్లడం కాదుగా – కనీసం నాలుగు మైళ్లు నడవడం మంచిదన్నారు నాకు...''

'' ఇవాళ నువ్ ఏదోలా ఉన్నావ్.... ఆత్మాభిమానం అంటూ, ' ఒరేయ్ బడుద్దాయీ, కావాల్సింది తీసుకో' అంటే బ్యాంకులో నీ పేర వేసిన మొత్తాన్ని ఉంచావ్.,... అసలు నీకు సుఖపడాలనే ఆసక్తే లేదాయె. పెళ్లీ లేదు – ఇల్లు లేదు – వాకిలి లేదు... ఏ ఉద్యోగం వేయించినా అందులో ఉండవ్... ఇంతకీ – 'వెండితెర' పత్రిక వాడి దగ్గరకే మళ్లీ వెళ్లిపోతావ్... వాడంటే నీకెందుకంత ప్రేమ ? ఏమిటో వాడికీ నీకు అంత విడదీయరాని బంధం !'' మమతలరావు తన మనసులోని ఆక్రోశాన్ని వెళ్లగక్కాడు.

ఒక్కనిమిషం మిత్రుడి వంక చూసి ''బీడీ పీక పంచుకోవడం.... సరేనా ?''

కోపం ఎవరికైనా రాగలదు సుమా అన్నట్లుంది ఆ సమాధానం.

''నువ్ బీదరికం అంటే ఓ కాల్పనికమైన ఆకర్షణని నీలో పెంచుకున్నావే... నువ్ అన్నీ తెలిసిన మూర్ఖుడివి. అయినా నీ కర్మకు నేను కర్తను కానుగా...''

దూరంగా ఉన్న డ్రైవర్‌కు సంజ్ఞ చేశాడు మమతలరావు. కారు దగ్గరకు వచ్చింది.

''అచట పుట్టిన చిగురు కొమ్మయినా చేవ... మధురవాణి సంగతి...'' కారులో కూచునే ముందు అడిగేశాడు పార్వతీశం.

''మధురవాణి ఎవరు ?''

''అంటే నీ పరధ్యానంలో అసలు వినిపించుకోలేదన్నమాట. సరేవిను. మన ఊరి పిల్ల – పిల్లేమిటి పెద్దే. పాత కథంతా ఎందుకు కాని నువ్ చెబితే ఆ బాన కడుపు నిర్మాత కాదనడట. వాడేమో కొత్త బొమ్మ తీస్తున్నట్లు విని నా దగ్గరకొచ్చింది. ఆమె మా ఊరి మనిషనే మాటాడనిచ్చాను... చింపిరిజుట్టు ముతక చొక్కా– ఈ మనిషిని – నన్ను – సహాయం అడిగింది...''

''మధురవాణీ.... టెంపుల్ స్ట్రీట్...'' అని ఏదో అడగబోయిన మమతలరావు మిత్రుడి ముఖంలో ఏదో గంభీరమైన, తీవ్రమైన ఆలోచనను చూసి కొంత తత్తరపాటు పడి ఠక్కున ఆగిపోయాడు.

''పోనియ్ !'' అంటూ డ్రైవర్‌కు చెప్పి, ''తిండి తిని రూమ్‌కు పోదువుగాని. నాకు రాత్రంతా ఈ పాటల గొడవ ఉండనే ఉంది...''

'' ఒరేయ్, నేను తినలేను... తినను.... రెండు సూఖా... రొట్టెలు నాకు నేనే కాల్చుకుంటేనే నాకు తృప్తి. మరెక్కడా ఏం తిన్నా పడదు. నీ కారులో రావడానికి సంతోషమే.. వీధి మొదటన దిగితే సందుల్లోకి నే పోతా...'' పార్వతీశం తెగేసి చెప్పేశాడు.

ఇద్దరూ మౌనంగానే ఉండిపోయారు.

డ్రైవర్‌కు తెలుసు పార్వతీశం సందుకు దగ్గరలో కారు ఎక్కడ ఆపాలో – ఆపాడు.

కారు దిగుతూ తన స్నేహితుడు పక్క జేబులో చెయ్యిపెట్టబోవడం గమనించాడు పార్వతీశం... ''వేషాలు వెయ్యకు... నాకు డబ్బంటే చేదు కాదని నీకూ తెలుసు... కాని అవసరం లేకుండా నీ

దగ్గరయినా పుచ్చుకోవడం అన్యాయం... కావలిస్తే నేనే అడుగుతానని నీకు ఏనాడో మాట ఇచ్చాను -- నువ్ తీసుకున్నావు. వెధవా... నన్ను చూసి నేనే జాలిపడే అవస్థలోకి నన్ను తోసెయ్యకు... అంబుజాన్ని అడిగానని చెప్పు... భోజనానికిక రానన్నానని మాత్రం చెప్పకు.... బోధపడిందా ?''

పార్వతీశం కారు దిగి సందులోకి వెళ్లిపోయిన కొద్ది క్షణాల వరకూ మమతలరావు తను తిన్న తిట్టు ధనరు నుంచి తేరుకోలేదు.

మెయిన్ రోడ్డులో నుంచి సందులోకి మళ్లీ అందులో నుంచి మరో ఇరుకు సందులోకి తిరిగి ఓ పది నిముషాలు నడిచి పార్వతీశం ఓ ఇంటి ముందు ఆగి తన గది తాళం తీశాడు.

వీధి దీపం వెలుతురు గదిలోకి బాగానే వస్తోంది. అతనికి రాత్రి గదిలో వేరే బెడ్‌రూమ్ లైట్ అవసరం లేదు. గదిలో కావలసినంత వెలుగు.

లోపలికి వచ్చి బాల్చీలో నీళ్లతో కాళ్లు కడుక్కుని గబగబా కుంపటిలో బొగ్గులు వేసి నిప్పు చేసి పెనం కాలవేసిన తరువాత బట్టలు మార్చుకున్నాడు పార్వతీశం. వెంటనే కొంచెం పిండి కలుపుకుని పెనం కాలేసరికి పిండి ఉండలు చెయ్యడమూ అయింది ఒత్తిన రొట్టి పెనం మీద వేసి పెనం వంకే చూస్తూ కూర్చున్నాడు. ఏదో అలికిడి అయినట్లు అనిపించి వెనక్కి తిరిగి ఆమెను చూసి గతుక్కుమన్నాడు.

'' ఎంత సేపయింది మీరు వచ్చి ?'' తత్తరపాటుతో అడిగాడు.

''నమస్కారం. ఇప్పుడే వచ్చా...''

''అరెరె! మాడిపోయింది. ఒక్కక్షణం కూర్చోండి...''

ఆమె మాట్లాడలేదు. అతని దగ్గరగా వచ్చి కూచుని ''మీరు వత్తండి, నే కాలుస్తా'' అంది.

....పెంకుటింటిలో చిన్న గది... ఓ వార పట్టి మంచం... మీద ఒక దుప్పటి, దిండు... గదిలో ఓ మూల బొగ్గుల కుంపటి... విసనకర్ర. వంట సరంజామా... గదికి ఓ గోడ వెంబడి బట్టలు వేలాడదీసుకోవడానికి ఒక తాడు.

పార్వతీశం ఆమె వంక చూడడం లేదు. పెనం క్రింద ఆమె చకచకా విసరగానే కణకణలాడుతున్న నిప్పుల్నే చూస్తున్నాడు.

'' ఓ వారం రోజులు క్రింద మా వాడితో చెప్పాను. కాని వాడు ' ఊ' ' ఆ' అనలేదు. నేను అంతకంటే వాడికి చెప్పలేను. అయినా ఈ రోజు మళ్లీ చెప్పాను. నేనేం చెయ్యలేని వాడిని – వాడిని ఇది చేసి పెట్టు అని అడిగే హక్కు నాకు ఎక్కడుంది?... ఏదీ ఆపేక్షించకుండా ఉన్నంతవరకే ఉండేవి కొన్ని బంధాలు. ఇదీ ప్రపంచం.''

''వద్దు... వద్దు... మరేం అనకండి... ఆయన చాలా మంచి మనిషని మీకు మించిన ఆప్తుడైన మిత్రులు మరెవరూ ఆయనకు లేరని చెప్పారు. మమతలరావని ఆయన పేరు సార్థకం.... మీరంటే ప్రాణం ఆయనకి. చిరుకొమ్మా, చేవా అంటూ కవిత్వం మొదలుపెట్టారు. మీరు చెబితే ఆయన మనస్సు నలభై సంవత్సరాలు వెనక్కుపోతుందన్నారు. మీరు చేసిన ఉపకారం జన్మలో మరిచిపోను... కాని....'' ఆమె ఆపేసింది.

పార్వతీశం మరేమీ మాట్లాడలేదు. మరింత పిండి తీసి కలపడం ప్రారంభించాడు.

ఆమె వంక చూడడానికి అతనికి ధైర్యం చాలడం లేదు. పిండిలో ఉప్పు వేసి నీళ్లు చిలకరించి

కలుపుతున్నాడు. పిండే ప్రపంచం అన్నట్లు, చుట్టూ మరేమీ లేనట్లు.

ఆమె అతని వంకే చూస్తోంది. ఆమె కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. మధ్యమధ్యన ఆమె ఊపిరి కదలికలలో తెలుస్తోంది మనసులున్న ఇద్దరి మనుషుల మధ్య ఆనందం కంటే వ్యథ వేగంగా వికరణమవుతుంది.

అతను కళ్లు తిప్పి తన వంక చూస్తాడేమో తనకి కొంత ఊరట కలుగుతుందనుకుంది. కాని తన వంక చూడడం తన బాధను ఎక్కువ చేసుకోవడమేననుకుని ఏమో ఆయన నిప్పు వంకే చూస్తున్నాడు.

అతని మనసులో ఆలోచన. ఈమె తన కంటే బాధను ఓర్చుకోవడం అలవాటు చేసుకున్న మనిషా? ఇద్దరి మధ్యా నిశ్శబ్దమే వారధి. నిశ్శబ్దమే ఇద్దరినీ కలవరపెడుతున్న సామాన్య లక్షణం.

–''పార్వతీశం గారూ....'' ఆమె ఏదో చెప్పబోయి ఎలా చెప్పాలో తెలియక తికమకపడిపోతోంది. గది వేడెక్కినట్లు ఆమె ముఖం మీద చెమట పడుతోంది.

''నన్ను క్షమించమ్మా... నీ కంటె పెద్దవాడిని... నీలోని తప్పులనీ, దోషాలనీ, బలహీనతలనీ వివరంగా తెలిసీ నిన్ను ప్రేమించేవాడు స్నేహితుడని ఓ నిర్వచనం... వాడు.. వాడంతే... ఆ మాట ముందు నీకు చెప్పకపోవడం నా తప్పు... వాడు చేసిన తప్పిదానికి...'' పార్వతీశం ఆమె కళ్లలోకి చూశాడు దీనంగా.

''నే చెప్పేది పూర్తిగా వినండి... నేను ముందే చెప్పా... నేను మాతృమూర్తినీ కాను... పతివ్రతనీ కాను... నాశీలం నాకే ముఖ్యమైనది కాని మనిషిని నేను – పతితను, చరిత్ర హీనురాలను... కోట్లాది సినిమా ప్రేక్షకులకు ఆయన మాట తియ్యని అనుభూతి... తేనెసోన.... ఆయన పాటలు రాస్తూనే ఉండాలి. వారు అలా వింటూనే వుండాలి... నా పక్కపంచుకున్న చాలా మంది పురుషుల్లో మరొకరు చేరితే నాకయితే పొయ్యేదేం లేదు. కాని వారిని ఆస్పత్రి పాలు చెయ్యడం... కడుపు కోసం చేసే కటిక పనిలా... నే భావించలేను... మూడు రోజులు ఆగమని బ్రతిమాలి చెప్పా ... నచ్చచెప్పా... బ్రతిమాలా... దయచేసి... మీరు ఒక్కరే – ఆయనకు కోపం కలిగించకుండా ఈ నిజాన్ని చెప్పగలిగినవారు. వేషం లేకపోతే పోయె.... ఆయనలో రోగాల్ని కుళ్లుని ప్రవేశపెట్టలేను... శెలవు....''

ఆమె వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది. పార్వతీశానికి పెనం మీద మాడుతున్న రొట్టె పొగ వాసన ముక్కుపుటాలని సోకలేదు.

కొంతసేపటికి తేరుకుని రొట్టె తీసి కిందపడేసి పెనం క్రిందకు దించి లేచాడు. మళ్లీ వీధిలోకి వెళ్లే బట్టలు ఆదరాబాదరాగా వేసుకొని ''టాక్సీ'' అంటూ మెయిన్‌రోడ్‌లో పోతున్న ఓ డ్రయివర్‌ను పిలిచి కంగారుగా కారు లోపల కూచుని ''టి–నగర్'' అని చెప్పాడు.

–'' ఏం రా, ఇలా వచ్చావ్...'' టాక్సీ దిగి డబ్బులిస్తున్న పార్వతీశాన్ని అడిగాడు మమతలరావు... ''వంట్లో ఏమయినా....''

''పొద్దున్నే నిన్ను పట్టుకోలేను... పద, ఆస్పత్రికి వెళ్లాలి. నిన్ను పట్టుకోలేనేమోనన్న కంగారులో టాక్సీలో వచ్చాను...''

'' ఏమయిందేమిటి... రేపు పొద్దున్న వరకూ అక్కరలేదు.. ఇప్పుడే బయలుదేరుదాం... డ్రైవరును బయటకు పంపా... ఓ పావు గంటలో వచ్చేస్తాడు.... ఆస్పత్రిలో తెలిసిన డాక్టర్‌కు ముందు ఫోన్ చేస్తా... అసలింతకీ ఏమయిందేవిటి ?'' మమతలరావు కంగారుగా అడిగాడు.

''నాకేం కాలేదు... నాలాంటి వాడే మరో దౌర్భాగ్యుడు... వాడిని మనం చూడాలి... నువ్ చూడడం ఉపయోగకరం...''

ఇంకేం చెప్పలేదు ప్రాణమిత్రుడికి. కారు దిగాక కొంచెం తేరుకున్నాడని నిర్ధారణ చేసుకున్నాక కొంత దూరం వెళ్లాక అడిగాడు మమతలరావు.

'' ఇంతకీ ఎవరా స్నేహితుడు ? ఏమా కథ ?''

'' ఇది కథ కాదు... జీవితం... నేను నీకు చెప్పేకంటే అతన్ని నువ్ చూడడం వలననే ఇంకా ఎక్కువ తెలుసుకోగలవ్... ఆవ్యక్తిని నువ్ చూడలేదు... పేరు కామరాజు... కొంచెం ఉద్రేక స్వభావం కలిగిన మనిషి... నేరుగా ప్రశ్నించి ఆయనను నొప్పించలేను. అతను నాకు బాగా తెలిసిన వాడు కాబట్టి నా దగ్గర ఏదీ దాచలేదు కాబట్టి అతన్ని నీకు పరిచయం చేయాలనిపించింది. ఎందుకో – నేను ఇంటికి వెళ్లాక – ఆలస్యం చెయ్యకుండా నిన్ను ఆయనకు పరిచయం చేశాక తప్ప నిద్రపోకూడదనిపించింది... బయలుదేరాను..''

మమతలరావుకు ఇది ఎంత ఆశ్చర్యం అనిపించినా ఎన్ని ప్రశ్నలో వెయ్యాలనే ఆరాటం కలిగినా పార్వతీశం ముఖం చూసి ధైర్యం కోల్పోయి దృష్టినంతా రోడ్డు మీదనే కేంద్రీకరించి కారును ముందుకు తీసుకుపోతున్నాడు.

ఎదురుగా మాంచి వేగంతో వస్తున్న లారీ లైట్లు డిమ్ చెయ్యకపోవడంతో కంగారుపడినా వెంటనే లాఘవంగా కారు ప్రమాదం జరగకుండా వారించగలిగాడు.

ఆస్పత్రిలో నేరుగా పార్వతీశం మమతలరావుని సుఖవ్యాధుల వార్డుకు తీసుకువెళ్లాడు. మంచాల మధ్య నుండి నడుస్తూ ఒక రోగి దగ్గరకు వెళ్ళారిద్దరూ. ముందు పార్వతీశం – వెనుక చుట్టూ బేలగా కలయచూస్తూ మమతలరావు.

రోగి కళ్లు బాగా లోతుకుపోయి ఉన్నాయి. కళ్ల చుట్టూ నల్లగా కమిలిపోయినట్లున్న చర్మం... ముఖంలో దైన్యం... ఇక జీవితంలో ఆలోచించినా, ఆశించినా లాభంలేదనే మానసికస్థితిలో ఉన్నట్లు రోగి గోడ వంక ఒత్తిగిలి పడుకున్నాడు.

బెడ్ దగ్గరకు ఎవరో వచ్చిన అలికిడి అయిందేమో వెల్లకిలా తిరిగాడు.

''నమస్కారం – నేను.... పార్వతీశాన్ని... ఇతను మీరు వినే ఉంటారు. మమతలరావు..... వెండి తెర కవి.... మిమ్మల్ని ఓమారు చూసిరమ్మని మధురవాణి నన్ను బతిమాలింది.

మమతలరావు రోగి వంక కాదు – పార్వతీశం వంక చూసి తల విదిలించుకున్నాడు.

''మధురవాణా ?... ఇంకేం చెప్పింది ?''

'' మీ ఆరోగ్యం బాగులేదని... ఇన్నాళ్ళ నుంచీ మేం ఈ ఊర్లో ఉంటున్నాం కాబట్టి మేం మీకేమయినా చేయగలిగితే చేయమనీ అడిగింది..''

''నా గురించి ఇంకేమీ చెప్పలేదా ?''

''లేదు...''

మమతలరావ్ జేబులో నుండి పర్సు తీసి తన కార్డు అందులోంచి తీశాడు... నేను డ్యూటీ డాక్టరుతో మాట్లాడతాను. మీకు ఏ సహాయం కావల్సినా నాకు ఫోన్ చేయండి... వస్తాం...''

ఇద్దరూ సెలవు తీసుకొని వచ్చేశారు బయటికి.

'' ఆ నిర్భాగ్యుడు...'' పార్వతీశం ఏదో చెప్పాలనుకున్న నిశ్చయానికి వచ్చి మొదలెట్టాడు.

'' ఆగు. నువ్ నాతో ఇంకేం చెప్పనక్కరలేదు.... నా ఇంగితం మీద నీకు ఇంత నమ్మకం పోయిందని నేననుకోలేదు....''

''అది కాదు... ఆమె ఎంత చెప్పినా వినకుండా.... ఈయన... ఇతడి కంటె ఎక్కువగా ఆమె ఇప్పుడు బాధపడుతోంది - మానసికంగా...'' ఇంకా ఏదో చెప్పబోతున్న పర్వాతీశం చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు మమతలరావు.

'' ఆమె సౌమనస్యానికి జోహార్లు.... ఆమె మాటలోనే కాదు - మనసులోనూ ఉంది మాధుర్యం... ఆమె ప్రజల మనసుల్ని పట్టి కుదపాలి... అందుకు నేను నిమిత్తుణ్ణి కావాలి... అవుతా....''

పార్వతీశాన్ని మరోసారి కౌగలించుకున్నాడు మమతలరావు.

**సరికొత్త కథ (సంపుటి)**

1995